

కార్మికుల చట్టాలను కుదించడం దుర్మార్గం



జిల్లా రిపోర్టును తెలియజేస్తున్న మనోహర్

కడప అర్బన్ : కార్మికుల చట్టాలను కుదించడం దుర్మార్గమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్ పేర్కొన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5వ తేదీ నిర్వహించే చలో ఢిల్లీకి జిల్లా నుంచి 150 మంది హాజరవుతామని పేర్కొన్నారు. ఆదివారం విజయవాడలో నిర్వహించిన సిఐటియు రాష్ట్ర కమిటీ సమావేశంలో జిల్లా రిపోర్టును సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపకపోతే పోరాటాలు తప్పవని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

'పది' ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- పకడ్బందీగా పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తాం
- నైట్‌విజన్‌తో ఉత్తమ ఫలితాలు సాధిస్తాం
- మోటివేషనల్ ప్రోగ్రామ్స్‌తో భయాన్ని పారదోలుతాం
- ఫెయిల్డ్ బాధ్యత ఎంఇఒలు, సబ్జెక్టు ఉపాధ్యాయులదే
- జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి



ముఖా ముఖి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పదవ తరగతి ఫలితాల సాధనకు పకడ్బందీ ప్రణాళికను అమ లు చేస్తున్నాం. ఉత్తమ ఫలితాల సాధనకు సమ్మేటివ్, ఫార్మేటివ్ అసెస్మెంట్, మోటివేషనల్ ప్రోగ్రామ్స్ వంటి పద్ధతులను ప్రణాళికా బద్ధంగా చేపట్టాం. టెన్త్‌ఎగ్జామ్స్ యువత భవితకు పునాధిగా మారిన నేపథ్యంలో పబ్లిక్ పరీక్షలనే భయాన్ని పోగొట్టేందుకు మోటివేషనల్ ప్రోగ్రామ్స్ నిర్వహించడం జరిగింది. పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహణకు సంబంధించి పరీక్షా కేంద్రాల ఎంపిక మొదలుకుని ఇన్విజిలేటర్ల దగ్గర నుంచి సిట్టింగ్, ఫ్లైయింగ్ స్క్వాడ్స్ నియామకాల వరకు అన్ని ఏర్పాట్లనూ చేయడమైందని పేర్కొంటున్న జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డితో ప్రజాశక్తి ముఖాముఖి..

టెన్త్ పరీక్షల షెడ్యూల్‌ను తెలపండి?

ఏప్రిల్ మూడు నుంచి 18వ తేదీ వరకు పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. ఇందుకు అనుగుణంగా 146 సెంటర్లను ఎంపిక చేశాం. దీంతోపాటు కీలకమైన నిర్వహణా పరమైన ఏర్పాట్లను పూర్తి చేయడమైంది.

టెన్త్ విద్యార్థుల సంఖ్య ఎంత?

జిల్లాలోని 35 మండలాల్లో 28,273 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు హాజరవుతున్నారు. ఇందులో 27,300 మంది ప్రభుత్వ, 973 మంది ప్రయివేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉన్నారు.

విద్యార్థుల సన్నద్ధత ఎలా ఉంది.?

టెన్త్ సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయడమైంది. ఇప్పటికి రెండు దఫాలుగా పునరుశ్చరణ ప్రక్రియను పూర్తి చేశాం. సమ్మేటివ్ అసెస్మె ంట్, ఫార్మేటివ్ అసెస్మెంట్ వంటి ఎగ్జామ్స్‌కు సిద్ధం చేశాం. ఈలెక్కన మూడు దఫాలుగా పబ్లిక్ పరీక్షలు రాసిన అనుభవాన్ని విద్యార్థుల్లో కలిగించాం. ఫలితంగా టెన్త్ విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు మానసికంగా సన్నద్ధం చేయడమైంది.

సమ్మేటివ్, ఫార్మేటివ్ ఎగ్జామ్స్ ప్రయోజనమేమిటి?

సమ్మేటివ్ అసెస్మెంట్, ఫార్మేటివ్ అసెస్మెంట్ ఎగ్జామ్స్ ద్వారా విద్యార్థుల్లో పబ్లిక్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలనే విషయం పట్ల అవగాహన కల్పించడం జరిగింది. ఇందులో విద్యార్థుల మార్కుల ఆధారంగా ఎ,బి,సి,డి కేటగిరీలుగా విభజన చేయడమైంది. సి, డి కేటగిరీలకు చెందిన వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాం. సమ్మేటివ్, ఫార్మేటివ్ పరీక్షల ఆధారంగా తయారు చేసిన డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు ద్వారా కామన్ మోడల్ పేపర్ మెటీరియల్ ఆధారంగా రోజువారీగా రూపొందిన ప్రశ్నలకు సబ్జెక్ట నిపుణుల ఆధ్వర్యంలో సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేశాం.

నైట్‌విజన్ యాక్టివిటీ గురించి తెలపండి?

2023 జనవరి నుంచి నైట్ విజన్ యాక్టివిటీని చేపట్టడమైంది. మండలవిద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆధ్వర్యంలో టెన్త్ విద్యార్థులు ఇళ్ల దగ్గర రాత్రివేళల్లో చదువుతున్న తీరుతెన్నుల అధ్యయనం చేయడం, అవసరమైన పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించడం, పరీక్షలకు విద్యార్థుల ప్రిపరేషన్ పట్ల అవగాహన కల్పించడం వంటి యాక్టివిటీని చేపట్టడ మైంది.

మోటివేషనల్ ప్రోగ్రామ్స్ ప్రయోజనమేమిటి?

విజేతల జీవితాలను పరిచయం చేయడం, కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికా సాన్ని కలిగించడం, ఆత్మవిశ్వాసమనే ఆయుధంతో జీవితాన్ని చూడడం వంటి లక్ష్యాలనే సామాజిక ప్రయోజనాన్ని సాధించడం. దీంతోపాటు పబ్లిక్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థుల ఆత్మ విశ్వాసాన్ని ప్రోదిచేయడం వంటి బహుళ ప్రయోజనమే లక్ష్యం. ఇందులో భాగంగా 2022-23 అకడమిక్ సంవత్సరంలో లక్ష మంది విద్యార్థుల్లో చైతన్యాన్ని ప్రోది చేయడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఇప్పటివరకు సుమారు 100 తరగతుల ద్వారా 63 వేల మందిని కలిశాం.

టెన్త్ ఫలితాల సాధన లక్ష్యమెంత?

ప్రతి మంగళవారమూ కలెక్టర్ ఆధ్యక్షతన పబ్లిక్ పరీక్షల సన్నద్ధతపై సమీక్ష తప్పనిసరిగా నడుస్తోంది. గతేడాది 73 శాతం ఫలి తాలతో రాష్ట్రంలో ఆరవ ర్యాంక్ సాధించడం జరిగింది. ఈఏడాది వంద శాతం ఫలితాల సాధనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. ఈఏడాది టెన్త్ ఫలితాల్లో ఫెయిల్డ్ శాతాన్ని బట్టి ఆయా ఎంఇఒలు, సబ్జె క్టుల్లో ఫెయిల్డ్ శాతాన్ని బట్టి ఆయా ఎంఇఒలు, సబ్జెక్టు ఉపాధ్యా యులపై చర్యలు తీసుకుం టామని హెచ్చ రికలు చేశాం. ఇందుకు సంబంధించి విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలి. 10 శాతానికి మించి ఉపాధ్యాయులు, విద్యార్థులు సెలవులు తీసుకోరాదని నిర్ణయి ంచడమైంది.

గంగమ్మ జాతరలో విషాదం

చాందిని బండి కింద పడి పులివెందుల జడ్‌పిటిసి మహేష్‌రెడ్డి మృతి


ప్రమాదంలో మృతిచెందిన జడ్‌పిటిసి, మహేష్‌రెడ్డి (ఫైల్‌ఫొటో)

పులివెందుల రూరల్ : పులివెందుల ఆర్.తుమ్మలపల్లి గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న గంగ మ్మ జాతరలోవిషాదం చోటు చేసుకుంది. చాందిని బండి కిందపడి పులివెందుల జడ్‌పిటిసి తుమ్మల మహేశ్వర్ రెడ్డి (48) మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. వివరాలు.. ఏటా తుమ్మలపల్లి గ్రామ సమీపంలో చింతల గంగమ్మ ఆలయంలో శివరాత్రి పర్వదినం మరుసటి రోజున గ్రామస్తులు జాతరను నిర్వహిస్తారు. ఈ ఏడాదీ పండగ తర్వాత ఆదివారం నిర్వహించారు. అందులో భాగంగానే చాందిని బండిని కట్టి గ్రామ పొలిమేర మీద గంగమ్మ ఆలయం వద్దకు తీసుకొస్తారు. అలా తీసుకొస్తున్న సమయంలో బండిపై ముందుభాగంలో కూర్చొన్న జడ్‌పిటిసి ప్రమాద వశాత్తు కిందపడ్డాడు. వెంటనే స్థానికులు అతన్ని వాహనంలో పులివెందుల ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో మహేష్‌రెడ్డి కుటుంబంలో, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతునికి భార్య ఉమా, కుమారుడు, హేమంత్‌రెడ్డి, కుమార్తె హేమలత ఉన్నారు. కుమారుడు యుఎస్‌ఎలో ఎంఎస్‌సి పూర్తి చేశారు. పండుగ చూసుకుని ఉద్యోగం కోసం తిరిగి యుఎస్‌ఎకు వెళ్లామనుకునే లోపు తండ్రి ఇలా ప్రమాదంలో మృతిచెందడంతో బోరున విలపించారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి పులివెందుల నియోజవర్గ ఇన్‌ఛార్జి వై.ఎస్. భాస్కర్‌రెడ్డి, తొండూరు మండల ఇన్‌ఛార్జి మధు, నాయకులు ఏరియా ఆస్పత్రికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం వారు మాట్లాడుతూ మహేశ్వర్ రెడ్డి మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. సర్పంచ్‌గా పనిచేసే మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు పార్టీలలో క్రియా శీలకంగా వ్యవహరిస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్‌పిటిసిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని చెప్పారు. అర్బన్ సిఐ రాజు, ఎఎస్ఐ స్వామీ, ఏరియా ఆసుపత్రికి చేరుకుని సంఘటనపై ఆరా తీశారు.

తారకరత్న మృతి తీరనిలోటు


తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

సినీనటుడు నందమూరి తారకరత్న సినీలోకానికి, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ, నాయకులు జనార్ధన్ పేర్కొ న్నారు. ఆది వారం స్థానిక పార్టీ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరి ఆధ్వర్యంలో టిడిపి నేతలు తారకరత్న మృతికి నివాళులర్పించారు. నందమూరి తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వికాస్ హరికృష్ణ మాట్లాడుతూ 23 రోజులుగా బెంగుళూరు నారాయణ హృదయాలయాలో చికిత్స పొందుతూ మృతి చెందడం బాధాకరమన్నారు. చికిత్సకు కోలుకుంటున్నారని టిడిపి కుటుంబ సభ్యులు ఎంతో సంతోషించారని, హఠాత్తుగా మృతి చెందడం దురదృష్టకరం అన్నారు. కార్యక్రమంలో టిడిపి నేతలు జనార్దన్, మసాపేట శివ, కుప్పం మల్లికార్జున, కొండా సుబ్బయ్య, వెంకటేష్ యాదవ్, అనిల్, కిరణ్, భరత్, నవీన్, నాగార్జున, విశ్వనాథ్, రాయుడు పాల్గొన్నారు. **నివాళులర్పించిన శ్రీనివాసరెడ్డి** నందమూరి తారకరత్న పార్థివ దేహానికి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి ఆదివారం నివాళులర్పించారు. హైదరాబాదులోని తారకరత్న ఇంటికి చేరుకొని పార్థివ దేహాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే తారకరత్న మృతి చెందడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి, చిత్రపటానికి తీరని లోటని పేర్కొన్నారు.

నేడు బండి సుమంత్‌కుమార్ ప్రమాణ స్వీకారం

కడప : ఇండియన్ యూత్ కాంగ్రెస్ కడప జిల్లా అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన బండి సుమంత్ కుమార్ ప్రమాణం స్వీకారోత్సవ కార్యక్రమం ఈనెల 20వ తేదీ ఉదయం 11 గంటలకు జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించనున్నామని, పార్టీ శ్రేణులు, నాయకులు, కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ నాయకులు, అభిమానులు, ప్రతి ఒక్కరూ పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఎపిసిసి డెలికేట్ బండి జయరయ్య పిలుపునిచ్చారు. కార్యక్రమానికి యూత్ కాంగ్రెస్ అగ్రనేతలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హాజరు కానున్నట్లు తెలిపారు.

చంద్రబాబు పర్యటన ఏర్పాట్లు పరిశీలన

కడప అర్బన్ : కడపలో ఈనెల 25న టిడిపి నిర్వహించ తలపెట్టిన సమావేశ ఏర్పాట్లను ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు గోవర్ధన్ రెడ్డి, హరిప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఎయిర్‌పోర్టు వద్ద సువిశాల మైదానంలో రాయలసీమ జోన్ సమావేశం నిర్వహించనున్నారు. ఆ మేరకు సమావేశానికి హాజరయ్యే నేతలు, కార్యకర్తల కోసం అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు సమావేశానికి హాజరువుతున్నారన్నారు. రాయలసీమ పరిధిలోని కడప, అనంతపురం, హిందూపురం, కర్నూలు, నంద్యాల పరిధిలోని 38 నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జీలు సమావేశానికి విచ్చేస్తారని తెలిపారు. సుమారు 10 వేల మంది సమావేశానికి హాజరు కానున్నట్లు తెలిపారు. సమావేశానికి విచ్చేసే వారి కోసం తాగునీరు, భోజన వసతి, పార్కింగ్ సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నాయి బ్రాహ్మణ కృతజ్ఞతా సభ కరపత్రాలు ఆవిష్కరణ

ప్రజాశక్తి - కడప

రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ సిద్ధవటం యానాదయ్య ఆధ్వర్యంలో విజయవాడ కేంద్ర కార్యాలయంలో నిర్వ హించబోయే నాయి బ్రాహ్మణ కృతజ్ఞత సభ కరపత్రాలను ఆదివారం కడపలోని వైసిపి జిల్లా అధ్యక్షులు కె. సురేష్ బాబు క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి రామ సుబ్బారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న తహశీల్దార్


మృతదేహాన్ని అంబులెన్స్ ఎక్కిస్తున్న తహశీల్దార్

ప్రజాశక్తి -పెండ్లిమర్రి

మండలంలోని పొలతల మల్లేశ్వర స్వామి దర్శనానికి వచ్చిన కర్నూలు జిల్లా బేతంచెర్లకు చెందిన చాకలి లక్ష్మీదేవి మహిళ ఆదివారం మృతి చెందారు. మృతదేహాన్ని ఆమె స్వగ్రామానికి తీసుకు వెళ్లడానికి కుటుంబ సభ్యులు ఇబ్బంది పడు తుండడంతో గమనించిన తహశీల్దార్ ఉదయభాస్కర్‌రాజు స్వయంగా రంగంలోకి దిగి మానవత్వం చాటు కున్నారు. తహశీల్దార్ వెంటనే అంబులెన్స్ పిలిపించి తానే స్వయంగా మృతదేహాన్ని అందులో ఎక్కించారు. అంత్యక్రియలు, ఇతర ఖర్చుల కోసం రూ. 15 వేల ఆర్థిక సాయం చేశారు.

సజావుగా ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్ష

- 87.4 శాతం హాజరు


అభ్యర్థుల హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న పోలీసులు


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఎస్‌పి అన్బురాజన్

ప్రజాశక్తి - కడప అర్బన్

నగరంలో ఆదివారం నిర్వహించిన ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షలు పారదర్శకంగా, సజావుగా ముగిశాయి. జిల్లాలో మొత్తం 9540 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 8335 మంది (87.4 శాతం) హాజరయ్యారు. 1205 మంది గైర్హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 6991 మంది పురుష అభ్యర్థులు కాగా 1344 మంది మహిళా అభ్యర్థులు ఉన్నారు. నగరంలోని మొత్తం 11 కేంద్రాల్లో ఎస్ఐ ఉద్యోగాల ప్రిలిమినరి పరీక్షలకు పకడ్బంది భద్రతా ఏర్పాట్లు పోలీసులు చేశారు. ప్రతి పరీక్షా కేంద్రంలో ఒక సిఐ, ఎస్ఐ, 10 మంది సిబ్బందితో పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద డిఎస్‌పి స్థాయి అధికారుల నేతృత్వంలో ఫ్లయింగ్ స్క్వాడ్ ల ద్వారా పర్యవేక్షణ ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాలను నాలుగు రూట్లుగా విభజించి భద్రతా చర్యలు చేపట్టినట్లు ఎస్‌పి తెలిపారు. కడప నగరంలోని కోటిరెడ్డి మహిళా కళాశాలలో నిర్వహించిన పరీక్షల నిర్వహణ తీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ నగరంలో నిర్వహిస్తున్న ఎస్ఐ ఉద్యోగాల ప్రాథమిక పరీక్షల నిర్వహణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకున్నామని పేర్కొన్నారు. సజావుగా పరీక్షల ప్రక్రియ కొనసాగిందని తెలిపారు. జిల్లా కేంద్రంలో 11 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాకు చెందిన 9540 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మాల్ ప్రాక్టీస్, మాస్ కాపీయింగ్ జరుగకుండా బృందాలు పర్యవేక్షిస్తున్నాయని చెప్పారు. పరీక్షా కేంద్రాల వెలుపల 144 సెక్షన్ అమలు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసరాలలో జిరాక్స్ సెంటర్లు మూసి వేయించామని పేర్కొన్నారు. ప్రశాంతంగా, సజావుగా పరీక్షలు నిర్వహించేలా అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు.

ఆహార ధాన్యాలను పునరుద్ధరించాలి

24న కలెక్టరేట్ ఎదుట ధర్నా
సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

ప్రజాశక్తి కడప అర్బన్

1952 నుంచి పేదలకు దేశంలో రేషన్ కార్డు దారులకు ఇస్తున్న ఐదు కిలోల ఉచిత ఆహాధాన్యాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ నుంచి నిలిపేసిందని వెంటనే పునరుద్ధరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక వార్షిక బడ్జెట్‌ను నిరసిస్తూ ఈనెల 24న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆదివారం సిపిఎం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 కేంద్ర ప్రభుత్వ వార్షిక బడ్జెట్‌లో ఔషధాలపై, ఆహార ధాన్యాలపై, నిత్యవసర వస్తువులపై జిఎస్‌టిని పెంచారని, వెంటనే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ఎల్ఐసి, ఎస్‌బిఐలలో ప్రజలు కూడబెట్టుకున్న సొమ్మును స్టాక్ మార్కెట్ జూదంలో పెట్టడాన్ని కేంద్ర ప్రభుత్వ విధానం మార్చుకోవాలన్నారు. ప్రజల నిత్యావసర వస్తువులపై జిఎస్‌టి ఉపసంహరించాలని కోరారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలి రేట్లు పెంచాలని, కేంద్ర బడ్జెట్‌లో నిధులు పెంచి కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రజల జీవనోపాధిపై నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం విదేశీ, స్వదేశీ క్రోని క్యాప్టెలిస్టుల ప్రయోజనాల కోసమే దేశ ప్రజలపై పన్నుల భారం వేస్తున్నారన్నారు. విద్యుత్ ఛార్జీలు, ఆస్తి పన్ను, గ్యాస్ ధరల పెంపు యూజర్ చార్జీల పేరుతో ప్రజలపై మోయరాని భారాన్ని మోపుతోందన్నారు. ఆదాని, అంబానీ లాంటి 116 మందికి శతకోటేశ్వర్లకు రూ.11 లక్షల కోట్ల రాయితీలు ఇచ్చారన్నారు. ఈ డిమాండ్ల సాధనకు ఈనెల 24న ఉదయం 10 గంటలకు కలెక్టర్ ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎ.రామ మోహన్, జిల్లా కమిటీ సభ్యులు బి.దస్తగిరి రెడ్డి, కె.శ్రీనివాసులు రెడ్డి, సిపిఎం నగర కమిటీ సభ్యులు పి.చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సాహితీ శిఖరి 'భూతపురి'

- వైవీయూ విసి ఆచార్య జి. రంగజనార్ధన



ఆచార్య భూపయ్యకు పురస్కారం అందజేస్తున్న అతిథులు

ప్రజాశక్తి - కడప అర్బన్

బాల్యంలోనే సాహిత్య వ్యాసంగానికి శ్రీకారం చుట్టి అనేక అవధానాలు చేయడంతోపాటు చారిత్రక, పౌరాణిక కావ్యాలు, నాటకాలు, వ్యాఖ్యానాలు రచించిన సాహితీ శిఖరి, అవధాన కేసరి డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఇన్‌ఛార్జి విసి ఆచార్య జి.రంగ జనార్దన అన్నారు. డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ మెమోరియల్ ట్రస్టు, అల్లసాని పెద్దన సాహిత్యపీఠం సంయుక్తంగా ఆదివారం ఉదయం సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలోని బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్యశర్మ 86వ జయంతి, 21వ స్మారక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి భూతపురి చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ డాక్టర్ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సాహితీకృషి విశిష్టమైందని, ఆయన 1953లో కవిగా సాహితీరంగంలో అడుగుపెట్టి 2002 వరకు అంటే దాదాపు అయిదు దశాబ్దాలపాటు తనదైన విలక్షణతతో సాహితీసేవ చేశారన్నారు. ఆయన ప్రాచీన మహాకవుల బాటలో ప్రయాణించి, సంస్కృతాంధ్ర భాషల్లో ప్రావీణ్యం సంపాదించి, పలు శతావధానాలు, అష్టావధానాలు చేశారని, ఆయన సాహితీకృషికి తార్కాణంగా శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్, గండపెండేర, గజారోహణాది గొప్ప సత్కారాలు అందుకున్నారని చెప్పారు. సభాధ్యక్షులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ కడప జిల్లా సాహిత్యానికి పుట్టినిల్లని, భూతపురి వంటి మహాకవులు ఈ గడ్డపై పుట్టారన్నారు. ఆధునిక సమాజానికి ఆవసరమైన మానవ విలువలు చోటుచేసుకునేలా భూతపురి, భూమయ్య కావ్యరచనలు సాగించారన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ భూతపురి రాసిన కృష్ణభారత కావ్యం సాహిత్య చరిత్రలో ప్రత్యేకించి చారిత్రక కావ్యప్రక్రియలో విశిష్ట స్థానాన్ని సంపాదించుకుందన్నారు. తెలంగాణా విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు డాక్టర్ సిహెచ్.లక్ష్మణ చక్రవర్తి మాట్లాడుతూ భూతపురి సుబ్రహ్మణ్య శర్మ సంస్కృతాంధ్ర భాషల్లో రచనలు చేసిన ధీశాలి అని, అందువల్లనే ఆయనను ఉభయ కవిసార్వభౌములుగా కవిపండితులు కీర్తించారన్నారు. సాహితీ సమరాంగణ ఆత్మీయ అతిథి, రిటైర్డ్ తెలుగు ఉపన్యాసకులు విద్వాన్ సమ్మెట శివశంకర్ మాట్లాడుతూ భూతపురి సుబ్రహ్మణ్య శర్మకు శ్రీకృష్ణదేవరాయలంటే అచంచలమైన గౌరవాభిమానాలు ఉండడంతో ఎంతో కృషిచేసి కృష్ణభారతమనే మహాకావ్యాన్ని సృష్టి చేశారన్నారు. కార్యక్రమంలో పుత్తా పుల్లారెడ్డి, డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, జానమద్ది విజయ భాస్కర్, జానమద్ది నాగరాజు, అలపర్తి పిచ్చయ్య చౌదరి, గోపాల్, డాక్టర్ శేషాద్రి, కొండూరు జనార్దన రాజు, పాలగిరి విశ్వప్రసాద్, డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, గానుగపెంట హనుమంతరావు, కొత్తపల్లె రామాంజనేయులు వంటి సాహితీవేత్తలు, సాహితీ ప్రియులు, భూతపురి ఆత్మీయులు పలువురు పాల్గొన్నారు.


విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని రెవరెండ్ గాలి బాలి పిలుపునిచ్చారు. ఆదివారం నగరలోని మరియాపురంలో ఉన్న సేయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల 40వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య చాలా గొప్పదన్నారు. ఉపాధ్యాయులను గౌరవించడం విద్యార్థుల ప్రథమ కర్తవ్యం అన్నారు. ఉపాధ్యాయుల వద్ద విద్య బుద్ధులు నేర్చుకుని విద్యార్థులు ప్రయోజకులు కావాలని పిలుపునిచ్చారు. కరస్పాండెంట్ ఫాదర్ పి. దేవదాసు మాట్లాడుతూ 40 వార్షికోత్సవంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డీఈవో దేవరాజ్ మాట్లాడుతూ విద్యతోపాటు, క్రీడల్లో, సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వార్షికోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, సిస్టర్ నిమారోస్, అసిస్టెంట్ డైరెక్టర్ అబ్రహం విద్యార్థులు, తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.


వార్షికోత్సవంలో గాలి బాలి

అన్ని సదుపాయాలతో యుఎస్ ఫంక్షన్ హాల్


ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

కడప అర్బన్ : కడప ప్రజలకు అన్ని సదు పాయాల తో యుఎస్ మహల్ (ఉస్మాన్ ఫంక్షన్ హాల్) నిర్మించడం శుభ పరి ణామమని ఉపము ఖ్యమంత్రి అంజాద్ బాషా, కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్ రెడ్డి, నగర్ మేయర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం రవీంద్ర నగర్ లోని ఎన్ఆర్ఐ సయ్యద్ ఉస్మాన్ బాషా నూతనంగా నిర్మించిన యూఎస్ మహల్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగర ప్రజలకు పెళ్లిళ్లకు, ఫంక్షన్లకు సువిశాలమైన గదులతో నిర్మించడం చాలా ఆనందదాయకమన్నారు. అనంతరం యుఎస్ మహల్ అధినేత సయ్యద్ ఉస్మాన్ బాషా మాట్లాడుతూ ఫంక్షన్ హాల్‌లో సెంట్రల్ ఏసి, స్త్రీలు, పురుషులకు విడివిడిగా గదులు ఉన్నాయని పేర్కొన్నారు. అవకాశాన్ని నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ముఖ్య అతిథులను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎపిఎన్ఆర్‌టిఎస్ డైరెక్టర్ బి.హెచ్ ఇలియాస్, ఎన్ఆర్ఐ గ్రూప్స్ ముమ్మడి బాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు పాకా సురేష్, వైసిపి సీనియర్ నాయకులు కార్పొరేటర్లు షఫీ, బాలస్వామి రెడ్డి, షంషీర్, తోట కృష్ణ, ఎన్ఆర్ఐ గ్రూప్స్ మిత్రబృందం, మిత్రులు శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి వేడుకలు

కాశినాయన : నర్సాపురంలో ఆదివారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో టిడిపి జిలాల మహిళా అధ్యక్షురాలు కర్నాటి శ్వేతారెడ్డి, నాయకులు వెంకటరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా శివాజీ చిత్రపటాన్ని గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కె.వి.సుబ్బారెడ్డి, ఉపసర్పంచ్ నాగేందర్ రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సుధీర్‌రెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ఒలంపిక్ అసోసియేషన్ చైర్మన్‌గా తవ్వా సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ఖాజీపేట

వైఎస్ఆర్ కడప జిల్లా ఒలింపిక్ అసో సియేషన్ చైర్మన్‌గా తవ్వా సుధీర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ మేరకు కడప నగరంలోని ప్రెస్‌క్లబ్ లో ఆదివానం అన్వాల్ జన రల్ బాడీ సమావేశం, ఎన్నికలు నిర్వహిం చారు. ఎన్నికల పరిశీలకుడిగా శ్రీధర్, శాప్ చీఫ్ కోచ్ అమృత్‌రాజ్ పాల్గొన్నారు. మండలంలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన సుధీర్‌రెడ్డిని రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను పలు వురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులుగా సమర్‌నాథ్‌రెడ్డి, సెక్రెటరీగా సునీల్, ట్రెజరీగా సాయికిషోర్‌ను ఎన్నుకున్నారు.



సభ్యత్వం తీసుకున్న మహిళలు

'దళిత మహిళల హక్కుల కోసం పోరాటం'

- నవ్యాంధ్ర మాల మహానాడు అధ్యక్షులు శరత్‌బాబు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

దళిత మహిళల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని నవ్యాంధ్ర మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు కొర్రపాటి శరత్‌బాబు తెలిపారు. మండలంలోని గూడెంచెరువు గ్రామంలో ఆదివారం ఆయన మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 50మంది మహిళలు నవ్యాంధ్ర మాల మహానాడులో సభ్యత్వం తీసుకున్నారు. వీరికి శరత్‌బాబు గుర్తింపు కార్డులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా గూడెంచెరువు గ్రామంలో దళితులకు శ్మశాన వాటిక లేదని, దీనిపై అధికారులతో మాట్లాడుతామన్నారు. పెత్తందార్లు దాడులకు పాల్పడితే సహించే ప్రసక్తే లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి రాణి మాట్లాడుతూ మహిళల సమస్యల పట్ల ముందుండి పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందరికీ అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామస్థాయి నవ్యాంధ్ర మాల మహానాడు మహిళా నేతలు పాల్గొన్నారు.

ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ప్రజలంతా సుఖసంతోషాలతో గడపాలని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఆకాంక్షించారు. మండలంలోని పెదనపాడు గ్రామంలో శ్రీ వేణుగోపాల స్వామి (శివాలయం) దేవాలయంలో మహా గాయత్రిదేవి ఉపాసకురాలు సద్గురు శంకరి అఘోరీ మాతాజీ ఎండు మిరపకాయల మహా యజ్ఞాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీనువాసులరెడ్డి, రామ కృష్ణారెడ్డి, వెంకటరమణ, నిత్యవర్ధన్, గ్రామ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



శివాలయంలో భూపేష్‌రెడ్డి

అరాచక పాలన పోవాలి : ఆర్ఆర్

గాలివీడు : రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అరాచక పాలన సాగిస్తోందని, త్వరలోనే ఈ ప్రభుత్వానికి ప్రజలు చరమగీతం పాడుతారని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఆర్.రమేష్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన నూలివీడు పంచాయతీ పరిధిలోని బోడసానిపల్లె, శ్రీనివాసపురం, కొండ్రరెడ్డిగారిపల్లె, కుమ్మరపల్లె, దళితవాడ, నల్లబత్తిన వాండ్ల పల్లె, కొత్త బండిన వాండ్లపల్లె, నాగూర్ వాండ్ల పల్లెలలో పర్యటించారు. పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

బైకును ఢీకొన్న ఆటో : యువకుడు మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని సురభి గ్రామం ఉట్కూరువాండ్లపల్లె వద్ద చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పెంచలయ్య (30)అనే యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. ఆదివారం వేంపల్లెలోని రాజారెడ్డి నగర్‌కు చెందిన పెంచలయ్య మోటర్ బైకులో లక్కిరెడ్డిపల్లెకు వెళుతుండగా, సురభి గ్రామంలోని ఉట్కూరువాండ్లపల్లె వద్దకు రాగానే మోటర్ బైకును రాయచోటి నుండి వస్తున్న ఆటో బలంగా ఢీకొంది. దీంతో మోటర్ బైకులో ఉన్న పెంచలయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఆటోలో ఉన్న పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదంపై ఆరా తీశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అల్లాడుపల్లె అన్నదాన సత్రం వద్ద ఘర్షణ

ప్రజాశక్తి - చాపాడు

అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం ఆవరణలోని భద్రకాళి సమేత అన్నదాన సత్రంలో ఆదివారం ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. శనివారం రాత్రి జాగరణ సందర్భంగా పాటకచేరి వద్ద ప్రొద్దుటూరు మండలం సీతంపల్లె గ్రామానికి చెందిన యువకులు రాళ్లు వేస్తూ అల్లరి చేస్తున్నారని ఉత్సవ నిర్వాహకులు వారిని వారించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంలో సీతంపల్లి గ్రామానికి చెందిన యువకుని తలకు గాయమైంది. పోలీసులు చికిత్స కోసం108లో తరలించి వారిని ఇంటికి పంపారు. ఆదివారం ఉదయం మళ్లీ సీతంపల్లె గ్రామానికి చెందిన 40 నుంచి 50 మంది అల్లాడుపల్లెకు చేరుకుని అన్నదాన సత్రం వద్ద ఉన్న అల్లాడుపల్లె సర్పంచు కిషోర్‌కుమార్‌రెడ్డి, ఉదయ్‌కుమార్‌రెడ్డిపై దాడి చేశారు. దీంతో తలకు బలమైన గాయాలయ్యాయి. ఒక్కసారిగా అన్నదాన సత్రం దగ్గర ఘర్షణకు దిగడంతో అల్లాడుపల్లెలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. ఈ సందర్భంలో అన్నదాన సత్రంలో కుర్చీలు, వంట సామగ్రి కూడా ధ్వంసమైనట్లు తెలిసింది. సిఐ నరేంద్రరెడ్డి, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. కిషోర్‌కుమార్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. ఉత్సవం సందర్భంగా పోలీస్ సిబ్బంది చాలా తక్కువగా ఉండడం, పర్యవేక్షణ సరిగా లేకపోవడంతోనే ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు.



అన్నదాన సత్రం వద్ద నెలకొన్న ఉద్రిక్తత



గాయపడిన ఉదయ్‌కుమార్‌రెడ్డి

సెల్‌ఫోన్ సిగ్నల్ లేక అవస్థలు

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్నా ఇప్పటికీ మొబైల్ ఫోన్లకు సిగ్నల్ అందని గ్రామం ఉందంటే ఆశ్చర్యం కలగక మానదు. ప్రపంచ ప్రసిద్ధి గాంచిన గండికోటకు మూడు కిలోమీటర్లు దూరంలో ఉన్న కొట్టాలపల్లె గ్రామం మొబైల్ సిగ్నల్స్ దూరంగా ఉంది. సుమారు 180 కుటుంబాలు, 400 మందికిపైగా ఓటర్లున్నారు. ఇక్కడ వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులున్నారు. ప్రస్తుతం కాలంలో మొబైల్ ఫోన్ నిత్యావసరాల్లో భాగమైపోయింది. గ్రామంలో సిగ్నల్స్ అందక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామం నుంచి దూరంలో ఉన్న బంధువులకు ఫోన్ చేయాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. ఏదైనా కార్యాలయాల నుంచి విషయాన్ని తెలుసుకోలేక పోతున్నారు. చివరికి పిల్లలకు ఆన్‌లైన్ క్లాసులు వినలేక పోతున్నారు. వర్క్‌ఫ్రం హోమ్ పద్ధతిలో పనిచేసే వారికి నెట్‌వర్క్ లేక అవస్థలు పడుతున్నారు. ఎవరితోనైనా ఫోన్ మాట్లాడాలంటే మిద్దె ఎక్కాల్సిందే. ఒక్కోసారి అక్కడా సిగ్నల్ అందనప్పుడు అర కిలోమీటరు దూరం అటు కొండాపురం వైపు లేదా ఇటు గండికోట వైపు కిందికైనా వెళ్లి ఫోన్ చేయాల్సి వస్తుంది. ప్రస్తుతం 5జి నడుస్తున్నప్పటికీ తమ గ్రామానికి కనీస నెట్ వర్క్ లేకపోవడం దారుణమని వాపోయారు. అధికారులు తక్షణ మే స్పందించి గ్రామ సమీపంలో సెల్ టవర్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

గతంలో వచ్చి చూసి పోయారు



రెండేళ్ల కిందట కొన్ని సెల్ టవర్స్ ఏర్పాటు చేసేందుకు ఆయా కంపెనీ వారు వచ్చి చూసి వెళ్లారు. ఇంతవరకు అతి గతి లేదు. ఎవరు పట్టించుకోవడం లేదు. పక్కనే గండికోట పర్యాటక స్థలంగా అభివృద్ధి చెందుతుంది. పక్కనే ఉన్న మాకు మాత్రం గ్రామంలో ఉండి బయటి సమాచారం తెలుసుకోలేకపోతున్నాం. దయచేసి ఏదోఒక సెల్ టవర్‌ను ఏర్పాటు చేయాలి.

-ఎస్. వెంకట రాముడు, జి. కొట్టాలపల్లి గ్రామం

కనికరం చూపండి



మాపట్ల అధికారులు, నాయకులు కనికరం చూపాలి. ఏళ్ళు గడిచినా అనాగరికంగా ఉండాల్సి వస్తుంది. పిల్లలు ఆన్‌లైన్‌లో క్లాసులు వినలేని పరిస్థితి. కరోనా సమయంలో ఎక్కడో ఉద్యోగం చేస్తూ ఇంటి వద్దకు వచ్చిన వారు మళ్లీ గ్రామం బయటికి వెళ్లి పని చేసుకోవాల్సి వచ్చేది.

- బి. పాములేటి, జి. కొట్టాలపల్లి గ్రామం

నిర్మలా సీతారామన్ వ్యాఖ్యలు గర్హనీయం : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

14వ ఆర్థిక సంఘం సిఫార్సుల కారణంగా ఆంధ్రప్రదేశ్‌తో సహ ఏ రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేది లేదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారమన్ చేసిన వ్యాఖ్యలు గర్హనీయమని పిసిసి మీడియా సెల్ చైర్మన్ ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రత్యేకహోదా విషయంలో మిగతా రాష్ట్రాలతో ఆంధ్రప్రదేశ్‌ని పోల్చడం సరికాదన్నారు. 2014 ఫిబ్రవరి 20న నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ ఆంధ్రప్రదేశ్‌కు అయిదేళ్లపాటు హోదా అమలు చేస్తామని పార్లమెంటులో ప్రకటించారని తెలిపారు. మిగతా ఏ రాష్ట్రానికి అలా పార్లమెంటులో ప్రకటన చేయలేదన్నారు. 2014 మార్చి 1న మన్మోహన్ సింగ్ అధ్యక్షతన కేంద్ర మంత్రి వర్గం సమావేశంలో ఎపికి అయిదేళ్లపాటు ప్రత్యేకహోదా ఇవ్వాలని తీర్మానించి, అమలు చేయాలని ప్రణాళిక సంఘాన్ని ఆదేశించినట్లు చెప్పారు. మిగతా ఏ రాష్ట్రానికి కేంద్ర మంత్రి వర్గం తీర్మానం చేయలేదని విమర్శించారు. ఎపికి అయిదేళ్లు కాదు 10 ఏళ్లు ప్రత్యేకహోదా ఇస్తామని బిజెపి తన ఎన్నికల మేనిఫెస్టోలో వాగ్దానం చేసిందని గుర్తు చేశారు. అలా ఏ రాష్ట్రానికి బిజెపి వాగ్దానం చేయలేదని తులసిరెడ్డి తెలిపారు. 14వ ఆర్థిక సంఘం సిఫార్సుతో ఎపికి ప్రత్యేకహోదాను ముడిపెట్టడం సరికాదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చాక 6నెలల పాటు 14వ ఆర్థిక సంఘం నివేదిక ఇవ్వలేదని, అప్పుడు ఎందుకు ప్రత్యేకహోదా అమలు చేయలేదని ఆయన ప్రశ్నించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఉన్నంత కాలం ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అమలు కాదన్నారు. కాంగ్రెసు ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా వస్తుందన్నారు. అనపర్తిలో చంద్రబాబు పర్యటనను జగన్ ప్రభుత్వం అడుగడుగునా అడ్డుకోవడం అప్రజాస్వామికమన్నారు. పోలీసులు రోడ్డుపై బైఠాయించడం విడ్డూరమన్నారు. చేతగాని, అసమర్థత, దద్దమ్మ ప్రభుత్వం అన్నారు. రాజకీయల్లో ఆత్మహత్యలే తప్ప, హత్యలు ఉండవనే నానుడిని జగన్ ప్రభుత్వం నిజం చేస్తోందన్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగిస్తే రాష్ట్రంలో సివిల్ వార్ వచ్చే పరిస్థితి ఉందని ఆయన తెలిపారు. వివేకానందరెడ్డి హత్య కేసులో ముఖ్యమంత్రి జగన్‌ను, భారతిరెడ్డిని విచారించాలని ఎన్. తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం పతనం : టిడిపి



విలేకరులతో మాట్లాడుతున్న ఎం.లింగారెడ్డి


ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

రాష్ట్రంలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పతనమైందని కడప టిడిపి జిల్లా అధ్యక్షులు మల్లెల లింగారెడ్డి తెలిపారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇదేంఖర్మ రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా చంద్రబాబు పర్యటనలో పోలీసుల తీరు సరిగా లేదన్నారు. పోలీసు అధికారులే ప్రభుత్వానికి తొత్తులుగా వ్యవహరిస్తున్నారని, కిందిస్థాయి అధికారులు ఏం చేస్తారని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పర్యటన లోకేష్ పాదయాత్రను అడ్డుకోవడమే తన పనిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. పాదయాత్రలో మైకులు లాక్కోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ప్రతిపక్ష నాయకులకు హక్కు, స్వాతంత్ర్యం లేకుండా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వంలో దళితులపై దాడి, విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, చెత్త పన్ను, ఇంటి పన్ను, సామాన్యుల ఆర్థిక వనరులపై దాడులు, ఇసుక దందా, లిక్కర్ మాఫియా, భూ దందాలతో రాష్ట్రాన్ని కొల్లగొడుతున్నారన్నారు. వైసిపి పాలనలో ఒక్క సామాజిక వర్గం కూడా ప్రశాంతంగా లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుల అక్రమ అరెస్టులను, బెదిరింపులను మానుకొని లోకేష్ పాదయాత్రను అడ్డుకోకుండా సజావుగా జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో టిడిపి కార్యకర్త అంటే ఏమిటో ప్రభుత్వం చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు. మాజీ కౌన్సిలర్ సీతారాంరెడ్డి, సానా విజయభాస్కర్‌రెడ్డి, లాయర్ సుబ్బయ్య, సుంకర వేణుగోపాల్, సిద్దయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దోసకు తెగుళ్లు.. రైతుకు దిగులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలో ఆరుతడి పంటగా రబీలో రైతులు సాగు చేసిన దోస పంటను బూడిద, మచ్చ తెగుళ్లు ఆశించాయి. దీంతో దిగుబడి తగ్గిందని రైతుల్లో ఆందోళన నెలకొంది. చాపాడు, రాజువారిపేట, సీతారామపురం, తిమ్మాయపల్లె, అయ్యవారిపల్లె, చియ్యపాడు తదితర గ్రామాల పరిధిలో 200 ఎకరాల్లో రైతులు దోస పంటను సాగు చేశారు. ముందస్తుగా సాగు చేసిన దోస పంట దిగుబడులు సరిగా లేక రైతులు వదిలేస్తున్నారు. ఎకరా సాగుకు రూ.25 వేలకు పైగా ఖర్చులు అవుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. దోస ధరలు టన్ను రూ.12వేలు మాత్రమే పలకడం, దిగుబడులు లేని కారణంగా నష్టాలు వస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దోస పంటను ఎక్కువ మంది రైతులు కౌలుకు తీసుకొని సాగు చేపట్టారు. ఎకరా కౌలుకు రూ.10వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లించాల్సి ఉంది. పంట తొందరగా దెబ్బతిని కాయలు సరిగా లేకపోవడంతో వదిలేస్తున్నారు. ఇప్పటికే చాపాడు, చియ్యపాడు వద్ద గొర్రెలకు, పశువులకు పంటను వదిలేశారు. మూడేళ్ల క్రితం సుమారు 500 ఎకరాలకుపైగా దోస పంటను రైతులు సాగు చేసి చాపాడు కేంద్రంగా నెల్లూరు, కర్నూలు, చిత్తూరు, తిరుపతి వంటి ప్రాంతాలకు ఎగుమతులు చేసేవారు. ప్రస్తుతం చాపాడులో మార్కెట్ కూడా రైతులకు అందుబాటులో లేకపోవడంతో వ్యాపారులు పంట పొలాలకు వద్దకు వచ్చి కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు.



సీతారామాపురం వద్ద గొర్రెలకు వదిలేసిన దోసపంట

తారకరత్న అకాల మరణం బాధాకరం



ఖాజీపేట : తారకరత్న చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రెడ్యం, నాయకులు

ప్రజాశక్తి - వేంపల్లె

నందమూరి తారకరత్న అకాల మరణం చాలా బాధాకరమని టిడిపి ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్ పేర్కొన్నారు. స్థానికంగా శనివారం నందమూరి తారకరత్న చిత్రపటానికి టిడిపి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో టిడిపి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి, మాజీ వార్డు మెంబర్ నల్లగారి కృష్ణారెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ ఎద్దుల కొండ్రాయుడు, పివి రమణ, గోటూరు నాగభూషణం, పోతిరెడ్డి శివ, మండల మైనార్టీ ఉపాధ్యక్షుడు ఇలియాస్, మండలమైనార్టీ ప్రధాన కార్యదర్శి మాబుషరీఫ్, శ్రీనివాసులు, రమణ, గౌస్, అల్లాబక్షు పాల్గొన్నారు.

ఖాజీపేట : నందమూరి తారకరత్న మృతికి ఆదివారం టిడిపి సీనియర్ నేత రెడ్యం వెంకటసుబ్బారెడ్డి ఘనంగా నివాళులర్పించారు. మండలంలోని దుంపలగట్టులో తన నివాసం వద్ద తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కెసి కెనాల్ ప్రాజెక్ట్ కమిటీ వైస్ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్యం నాగేశ్వర్‌రెడ్డి, ఇండ్ల వెంకటరెడ్డి, మున్నెల్లి సుబ్బరాయుడు, గుడ్లవీటి సుబ్బరాయుడు, తుమ్మల రామసుబ్బారెడ్డి, బండి వెంకటసుబ్బారెడ్డి, తప్పెట కృష్ణారెడ్డి, మున్నెల్లి వెంకటసుబ్బయ్య(చిన్న) పాల్గొన్నారు.

జమ్మలమడుగు రూరల్ : నందమూరి తారకరత్న ఆత్మకు శాంతి చేకూరాలని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి ఆకాంక్షించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో రమణారెడ్డి, నారాయణరెడ్డి, వెల్డింగ్ గైబు, గౌస్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బండలాగుడు పోటీల్లో విజేత చౌటపల్లె ఎద్దు

ప్రజాశక్తి - చాపాడు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం ఆవరణలో ఆదివారం నిర్వహించిన బండలాగుడు పోటీల్లో ప్రొద్దుటూరు మండలం చౌటపల్లెకు చెందిన మార్తాల చంద్రఓబుళరెడ్డి ఎద్దు విజేతగా నిలిచాయి. ఆ ఎద్దు 1808 అడుగులు బండను లాగి మొదటిస్థానంలో నిలిచాయి. ఈ పోటీలను ఎంపిపి టి.లక్షుమయ్య, ఆలయ చైర్మన్ జిటి వెంకట సుబ్బారెడ్డి ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుంచి 8జతల ఎద్దు బండలాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. నంద్యాల జిల్లా పీఆర్ పల్లెకు చెందిన నాగయ్య ఎద్దు 1680 అడుగులు లాగి రెండవ స్థానంలో నిలిచాయి. నందలూరుకు చెందిన హబీబుల్లా ఎద్దు 1465 అడుగులు లాగి మూడవ స్థానం, వివిఎన్ పల్లె మండలం కీర్తిపల్లెకు చెందిన సి.భరత్‌కుమార్ ఎద్దు 1465 అడుగులు లాగి నాల్గవ బహుమతి, సింహాద్రిపురం మండలం చెర్లోపల్లెకు చెందిన నంద్యాల శివరామిరెడ్డి ఎద్దు 1449 అడుగులు లాగి ఐదో బహుమతి, ఖాదర్‌బాద్ చెందిన సిద్ధారెడ్డి నాగసుబ్బారెడ్డి ఎద్దు 1093 అడుగులు లాగి ఆరవ బహుమతి, దొరసానిపల్లికు చెందిన కె.వి.రెడ్డి ఎద్దు 1045 అడుగులు లాగి ఏడో బహుమతి సాధించాయి. మొదటి స్థానంలో నిలిచిన ఎద్దు యజమానులకు అల్లాడుపల్లె గ్రామానికి చెందిన వీర నారాయణ యాదవ్ రూ.1,00,116 బహుమతిగా అందజేశారు. రెండవ బహుమతిని లక్ష్మీపేట కర్నాటి నారాయణరెడ్డి రూ.70,116, మూడో బహుమతిని అల్లాడుపల్లె రజకుల సంఘం రూ.60,116, నాలుగో బహుమతిని చెన్నూరు జువెలర్స్ వారు రూ.40,116, 5వ బహుమతిని ఎంపిపి టి.లక్షుమయ్య రూ.20,116, 6వ బహుమతిని నరహరిపురం గ్రామానికి చెందిన పి.చిన్న వీరారెడ్డి కుటుంబ సభ్యులు రూ.12,116, 7వ బహుమతిని అల్లాడుపల్లె గ్రామానికి చెందిన కోడూరు వెంకటశివ రూ.5,116 అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ వెంకట సుబ్బారెడ్డి, ఎంపిపి లక్ష్మమయ్య, సర్పంచు కిషోర్‌కుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు వేమారెడ్డి, నారాయణరెడ్డి, ఓబుల్‌రెడ్డి, శాంతరాజు, జయసుబ్బారెడ్డి, శ్రీనువాసులరెడ్డి పాల్గొన్నారు.



బండలాగుతున్న చౌటపల్లె ఎద్దు



హోటల్‌లో తనిఖీ నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

హోటళ్లు, మాంసం విక్రయదారులు ప్లాస్టిక్ కవర్లు వాడితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని హోటళ్లు, మాంసం విక్రయ సెంటర్లను ఆదివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న పలు హోటళ్ల యజమానులకు జరిమానా విధించారు. మాంసం దుకాణాల వారు పశువైద్య అధికారులు ధ్రువీకరణ పత్రాన్ని తప్పక తీసుకోవాలన్నారు. మాంసం ధరలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. నిబంధనలు పాటించకపోతే దుకాణాల లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.



అన్నదానం కార్యక్రమంలో వికసిత ఫౌండేషన్ సభ్యులు

నిరుపేదలకు అన్నదానం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

యునైటెడ్ ప్రవాస యాదవ్ కమ్యూనిటీ సాయంతో లక్ష్మీదేవి, నరసింహులు యాదవ్ కుమారుడు చెని నాగేంద్ర యాదవ్ పుట్టినరోజు సందర్భంగా పట్టణంలోని వికసిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో జంగం ప్రాంతంలో ఉన్న నిరుపేదలకు ఆదివారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వికసిత ఫౌండేషన్ అధ్యక్షురాలు శూలం లక్ష్మీదేవి మాట్లాడుతూ పుట్టినరోజు సందర్భంగా ధనాన్ని వృథా కానివ్వకుండా నిరుపేదల ఆకలి తీర్చడం చాలా గొప్ప విషయమన్నారు. దాతలకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, ఫౌండేషన్ సభ్యులు పాలెం సంజీవ రాయుడు, గిరి పాల్గొన్నారు.



జాతరలో ఎమ్మెల్యే, మాజీ ఎంపిపి, నాయకులు

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని చిన్నదుద్యాల, బొందలకుంట గ్రామంలో ఆదివారం నిర్వహించిన గంగమ్మ జాతరను కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, మార్కెట్ యార్డు చైర్ పర్సన్ ఉమాదేవి, వైసిపి నాయకులు డాక్టర్ నవజ్యోతి, మండల యూత్ అధ్యక్షులు సుమంత్ యాదవ్, రమణ ట్రాన్స్‌పోర్టు అధినేత వెంకటరమణారెడ్డి, మౌనిక మిల్క్ డెయిరీ ఎండి శ్రీనివాసులు, ప్రజలు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

స్థానిక శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతో ఆకట్టుకున్నాయి. పరిపాలనాధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మహాశివరాత్రి పురస్కరించుకొని రెండు రోజులపాటు సంబరాలను నిర్వహించారు. ఇందులో భాగంగా రెండో రోజు జి.రవీంద్రనాథ్‌శర్మ, సహకారంతో మాష్టర్ సింహ డ్యాన్స్ స్టూడియోస్, కడప చిన్నారులచే జనపదం, వెస్ట్రన్ నృత్యాలు ప్రదర్శించారు.



సిమెంటు రహదారికి నోచుకుని జగనన్న కాలనీలోని ఓవీధి

జగనన్న కాలనీల్లో సమస్యలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న జగనన్న కాలనీలు సమస్యలకు నిలయాలుగా మారాయి. ఆ కాలనీలో కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి ముందుకు రావడం లేదు. సిమెంటు రోడ్లు, విద్యుత్ సదుపాయం, తాగునీటి పైప్‌లైన్లు వంటి కనీస సదుపాయాలు అరకొరగానే ఉంటున్నాయి. మండల పరిధిలోని దుంపలగట్టు గ్రామంలో గట్టుపైన జగనన్న కాలనీ ఏర్పాటుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ కాలనీలో దాదాపు 250 పైబడి నివాసాలు మంజూరయ్యాయి. ఇప్పటికీ కాలనీలోని పలు వీధుల్లో సిమెంట్ రహదారులు లేవు. ఇళ్ల నిర్మాణం చేపట్టాలనుకొనే లబ్ధిదారులు వసతులు సమకూరకపోవడంతో ముందుకు రావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జగనన్న కాలనీలో కనీస సదుపాయాలు కల్పించి సమస్యలను పరిష్కరిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు పేర్కొంటున్నారు.

వైభవంగా 'జరి' మహోత్సవం

కలకడ : మండల కేంద్రమైన కలకడ సమీపంలోని దేవళంపేటలో కామాక్షి సమేత సిద్దేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా దేవాలయానికి అనుసంధానంగా ఉన్న జరి మహోత్సవం ఆదివారం అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నుంచే కాకుండా కడప, చిత్తూరు, అనంతపురం, జిల్లాల నుండి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పీలేరు, మదనపల్లి డిపోల నుండి సుమారు 32 ఆర్‌టిసి బస్సు సర్వీసులను ఏర్పాటు చేశారు. సిఐ నాగేంద్ర, ఎస్ఐ తిప్పేస్వామి, 30 మంది ఎన్‌సిసి విద్యార్థులతో కలిసి భారీ సంఖ్యలో బందోబస్తు నిర్వహించారు.